# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 10 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హ్యామ్ విధానంతో రోడ్లకు మహర్దశ

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హ్యామ్ విధానంతో రాష్ట్రంలోని రోడ్లకు మహర్దశ పట్టనుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే మూడేండ్లల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లను అద్దంలా తయారుచేస్తామని ప్రకటించారు. దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలుస్తుందన్నారు. రోడ్ల అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కతజ్ఞతలు తెలిపారు. గురువారం డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో హ్యామ్ రోడ్ల నిర్మాణం పై ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్, ఫైనాన్స్ సెక్రెటరీ హరిత, ఆర్ అండ్ బీ అధికారులు జయభారతీ, బీవీ రావు, పలువురు ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు. హ్యామ్ రోడ్ల ప్రతిపాదనలకు సంబంధించిన వివరాలను స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హ్యామ్ ద్వారా వచ్చే మూడేండ్లల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బీ రోడ్లు అద్దంలా

మిగితా 4వ పేజీలో

# బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు స్టే

- రెండ్రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు
- జీవో అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై కూడా..
- నిలిచిపోయిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో నంబర్ 9పై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు జీవో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై కూడా హైకోర్టు స్టే విధించింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలు దాఖలు చేయడానికి పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ కనీసం ఆరు వారాలపాటు నిలిచిపోనుంది.

జీవో నంబర్ 9ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రెండు రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణ రాష్ట్రంలోనే జరిగిందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించామని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో బీసీ జనాభా 57.6 శాతం ఉన్నట్లు తేలిందని, అందువల్ల 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయసమ్మతమని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించి అసెంబ్లీ తీర్మానం చేసిందని ఏజీ తెలిపారు.

చట్టసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ గడువులోగా ఆమోదించకపోతే కూడా అవి చట్టంగానే పరిగణించాలన్నది తమిళనాడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా స్పష్టమైందని అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వెలువడిందని, నోటిఫికేషన్ అనంతరం న్యాయస్థానాల జోక్యం ఉండదని సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆయన వాదించారు.

మరోవైపు పిటిషనర్ల తరఫున న్యాయవాది రవి వర్మ మాట్లాడుతూ రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50 శాతం సీలింగ్ లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, వారికి మొత్తం 67 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇస్తున్నారని వివరించారు. మిగతా 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్ కేటగిరీగా ఉందన్నారు. రెండు రోజులపాటు సాగిన వాదనల అనంతరం హైకోర్టు జీవో నంబర్ 9 అమలుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు, ప్రభుత్వ కౌంటర్లపై ప్రతివాదనలకు పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.

హైకోర్టు స్టేతో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరగే అవకాశం లేదని ఎంబీసీల తరఫున వాదించిన న్యాయవాది సుదర్శన్ తెలిపారు. ఆరు వారాలపాటు ఎన్నికల ప్రక్రియ నిలిచిపోతుందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తాము సమర్థిస్తున్నప్పటికీ ఎంబీసీలకు వర్గీకరణ ద్వారా న్యాయం చేయాలని వాదించామని తెలిపారు.

### బీసీల నోటివద్ద ముద్ద లాగేసినట్లుగా అయ్యింది

హైకోర్టు నిర్ణయంపై బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు స్పందించారు. ఉన్నత న్యాయస్థానం స్టే ఇవ్వకుండా ఉండేందుకు ఎంతో ప్రయత్నించామని వాకాటి శ్రీహరి అన్నారు. హైకోర్టు స్టేతో బీసీల నోటివద్ద ముద్ద లాగేసినట్లుగా అయ్యిందని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తప్పక ఇస్తామని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీ అందిన తరువాత సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి సుప్రీంకోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

### బీజేపీ కారణం

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడానికి బీజేపీ కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, హైకోర్టు ఉత్తర్వుల కాపీ అందిన వెంటనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.





### భారత్-అమెరికా

## సంబంధాలు పెంచేలా నిర్ణయాలుండాలి

**అమెరికా బృందంతో సీఎం రేవంత్ రెడ్డి..**

బలగం టీవీ, హైదరాబాద్

అమెరికా నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో అమెరికా-భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్-1 బీ వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుండటమే కాక అస్థిరత, అపార్థానికి దారి తీస్తాయని చెప్పారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శంగా ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. హడ్సన్ ఇనిస్టిట్యూట్ కు చెందిన ప్రతినిధులు, వివిధ రంగాల మేధావులు, బిజినెస్ లీడర్లు, దాతలతో కూడిన అమెరికన్ ప్రతినిధి బృందం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి గారితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పరిశ్రమలు అండ్ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేంద్ర రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ అమెరికన్ ప్రతినిధి బృందం భారత్‌లోని పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార, వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై అభిప్రాయాలు స్వీకరిస్తోంది. సమావేశంలో ముఖ్యమంత్రి తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారినా విధానాలను మార్చవలసిన అవసరం లేదని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడుల గమ్యస్థానంగా, ప్రపంచ నగరంగా ఆకర్షణగా మారిందని, దేశీయ-విదేశీ దిగ్గజ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోంది,

మిగితా 4వ పేజీలో



### భారత్ వృద్ధి గాథలో భాగస్వామ్యం కావాలి

- ప్రపంచ వ్యాపారులకు ప్రధాని మోదీ పిలుపు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచిన భారత్ వృద్ధి గాథలో భాగస్వామ్యం కావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ వ్యాపారులను ఆహ్వానించారు. సాంకేతికత కేవలం సౌలభ్యం కోసమే కాకుండా, సమానత్వ సాధనమని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్య రాజధాని ముంబయిలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో పాల్గొన్న మోదీ పలు ముఖ్య వ్యాఖ్యలు చేశారు.

మోదీ మాట్లాడుతూ, సమ్మిళిత విధానం భారత బ్యాంకింగ్ వ్యవస్థను మార్చివేసిందని తెలిపారు. "గతంలో బ్యాంకింగ్ వ్యవస్థ ప్రత్యేక హక్కుగా ఉండేది. కానీ డిజిటల్ టెక్నాలజీ దానిని సాధికారత సాధనంగా మార్చింది. నేడు డిజిటల్ చెల్లింపులు రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. దీనికి ఘనత %జీూవీ% ట్రినిటీ ం జనధన్, ఆధార్, మొబైల్ ం కు చెందుతుంది," అని ఆయన పేర్కొన్నారు. భారత్ ఫిన్‌టెక్ రంగం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని, ఇతర దేశాలతో సాంకేతికత పంచుకోవడమే కాకుండా దానిని అభివృద్ధి చేయడంలో కూడా భారత్ ముందంజలో ఉందని మోదీ అన్నారు. "ఆర్థికం అంటే సంఖ్యలు మాత్రమే కాదు, మానవ పురోగతిని సూచిస్తుంది. ఆవిష్కరణ లక్ష్యం కేవలం వృద్ధి కాదు, మంచితనం కూడా కావాలి," అని ప్రధాని తెలిపారు. భారత ప్రజాస్వామ్యాన్ని ప్రపంచానికి ఆదర్శంగా నిలబెట్టామని, ప్రజాస్వామ్య స్ఫూర్తి పాలనకు బలమైన స్తంభంగా మారిందని ఆయన నొక్కి చెప్పారు. "ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు లేదా విధాన రూపకల్పన మాత్రమే కాదు, ప్రజల భాగస్వామ్యానికి ప్రతీక," అని మోదీ అన్నారు.

మిగితా 4వ పేజీలో

## నోటిఫికేషన్ నిలిపివేస్తున్నట్టు ఎస్ఈసీ ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు ఆదేశాల మేరకు నోటిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లు ఎస్ఈసీ గురువారం ప్రకటించింది. ఎన్నికల కోడ్ అమలు, నామినేషన్ ప్రక్రియలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. కొత్త నోటిఫికేషన్ జారీ అయ్యే వరకు ఎన్నికల ప్రక్రియలన్నింటినీ నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. కోడ్ అమలు, నామినేషన్ల పరిశీలన, వెనక్కి తీసుకునే ప్రక్రియలను సహా అన్ని ఎన్నికల పనులను నిలిపివేయాలని నిర్ణయించింది. తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే ఎన్నికల ప్రక్రియను పునఃప్రారంభిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది.

## హైదరాబాద్‌లో భారీగా ఎఫెడ్రిన్ డ్రగ్స్ స్వాధీనం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో భారీ స్థాయిలో డ్రగ్స్‌ను ఈగల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాయి దత్త రెసిడెన్సీని గోడిచ్చి సోదాలు నిర్వహించి సుమారు 220 కిలోల ఎఫెడ్రిన్ డ్రగ్స్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో శివరామకృష్ణ వర్మను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. ఫ్యాక్టరీని లీజుకు ఇచ్చిన ఓనర్ ప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అధికారులు అంచనా ప్రకారం, పట్టుబడిన డ్రగ్స్ విలువ దేశీ మార్కెట్‌లో సుమారు రూ.10 కోట్లు, అంతర్జాతీయంగా రూ.72 కోట్లు ఉండవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా, ఎఫెడ్రిన్ను మెథాంఫెటమైన్‌గా మార్చితే దాని విలువ పదింతలుగా పెరుగుతుంది.

పోలీసుల వివరాల ప్రకారం, ప్రసాద్ పూర్వపు డ్రగ్ కేసుల్లో బెంగళూరు, హైదరాబాద్‌లో అరెస్ట్ అయిన వ్యక్తి. 250 కిలోల అంఫెటమిన్, 10 కిలోల అల్ప్రాజోలోమ్ తయారీ కేసుల్లో అతను పూర్వం జైలుపోయాడు. తాజాగా జీడిమెట్లలో నివసిస్తూ ఎఫెడ్రిన్ తయారీ కేంద్రాన్ని నడిపించినట్లు గుర్తించారు. పీఎన్ఎం లైఫ్ సైన్సెస్ కంపెనీ ద్వారా రసాయనిక మందుల తయారీ పేరుతో అక్రమంగా డ్రగ్స్ ఉత్పత్తి చేశారు. ఫ్యాక్టరీకి సంబంధించిన లీజు డీడ్‌లు, బోర్డు రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, ఫార్మా డాక్యుమెంట్స్ వంటి ఆధారాలు అందుబాటులో లేవని పోలీసులు పేర్కొన్నారు. సెప్టెంబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీం 15,847 డ్రగ్స్ కేసుల్లో 32,546 మందిని అరెస్ట్ చేసి, సుమారు రూ.150 కోట్లు విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకుంది. తాజా కేసు స్థానికంగా హల్‌చల్ సృష్టించింది.

## మొక్కజొన్న పంటకు మద్దతు ధర

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఈ అంశంపై జరిగిన సమీక్షా సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

మొక్కజొన్న పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో, ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేపట్టనుందని మంత్రి ప్రకటించారు. గత ఏడాది కూడా ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం కేవలం మద్దతు ధర ప్రకటనకే పరిమితమై, కొనుగోళ్లు జరపకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.535 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా పండిన జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసిన విషయం గుర్తుచేశారు.

రాష్ట్రంలో ఈ సీజన్‌లో సుమారు 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని తుమ్మల తెలిపారు. సాగు పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో సగటున ఎకరాకు 18.50 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. మొత్తం 11.56 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. ఈ సీజన్‌లో 8.66 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశామని మంత్రి వివరించారు. రైతులకు న్యాయమైన ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## బీసీ బిల్లును ఆపుతుంది బీజేపీ, బీఆర్ఎస్సే



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీసీ బిల్లును ఆపుతుంది బీజేపీ,బీఆర్ఎస్సేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బీసీ బిల్లును కేంద్రం ఆపుతుందని, దానికి బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలే కారణమని గాంధీ భవన్‌లో మీడియాకు తెలిపారు. బీసీలకు మేలు జరుగుతుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఓర్వలేకపోతున్నాయని ఆయన మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం బీసీలకు ఉరితాడుగా మారిందని, రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చట్టం రూపొందించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా సర్వే నిర్వహించి, పక్కా లెక్కలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ లకు చిత్తశుద్ధి లేదు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పిటిషన్ పై ఎందుకు ఇంప్లీడ్ కాలేదు. బీసీల నోటికాడ ముద్దను లాక్కున్నాయి. పక్కా లెక్కలతో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాం. దుష్టులు, దుర్మార్గులు అడ్డుకున్నా సర్వే పక్కాగా చేశాం.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. బీఆర్ఎస్, బీజేపీ బీసీ వ్యతిరేకులు. బీసీలు అమాయకులు కాదు అన్నీ గమనిస్తున్నారు. సైంటిఫిక్ సర్వే చేసి బిల్లు చేశాం. రిజర్వేషన్లను అడ్డుకుంది బీజేపీ,బీఆర్ఎస్సే. బీసీ బిల్లు గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉంది. బీజేపీ ఆధ్వర్యంలోనే కేంద్రం బిల్లును ఆపుతోంది. ప్రభుత్వం బిల్లు పాస్ చేసి పంపితే గవర్నర్ ఎందుకు ఆమోదించరు.. మేం గవర్నర్ కు పంపి ఆరు నెలలు అవుతుంది. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం అని అన్నారు .

తెలంగాణ పీసీసీ చైర్మన్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ కుట్రలతోనే బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని అన్నారు. బీసీలకు మేలు జరుగుతుంటే బీజేపీ, బీఆర్ ఎస్ తట్టుకోలేకపోతున్నాయని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ ఎస్ లోపాయికారి ఒప్పందంతోనే అడ్డుకున్నారు..బీసీలకు న్యాయం జరిగే వరకు ఎన్నికలకు వెళ్లమని స్పష్టం చేశారు మహేష్ గౌడ్.

## బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం

- రేవంత్ రెడ్డి బీసీలను దారుణంగా మోసం చేశాడు
- కేంద్రంలో బీజేపీ కూడా వెన్నుపోటు పొడిచింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులపాటు మోసపూరితంగా వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈరోజు హైకోర్టు ఇచ్చిన స్టే తో 42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ సర్కారు ఇంతకాలం చేసిందంతా డ్రామా తప్ప మరొకటి కాదని రుజువైపోయిందని ఆయన పేర్కొన్నారు.

కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలు, చట్టం పరీక్షకు నిలవకుండా వ్యవహరించిన తీరు వల్లనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందని కేటీఆర్ కాంగ్రెస్ పై మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలరాసి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని బీసీలను దారుణంగా మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం మభ్యపెట్టేందుకు తెచ్చిన జీఓ న్యాయస్థానాల్లో నిలబడదని బీఆర్ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమని తేలిపోయిందని ఆయన స్పష్టం చేశారు.కులగణనను మొదలుకుని జీఓ దాకా రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో అడుగడుగున చేసినదంతా మోసం, దగా, నయవంచన తప్ప మరొకటి కాదు. కులగణన నుంచి మొదలుకొని ప్రతి సందర్భంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వానికి అనేక సూచనలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లులను ఆమోదింపజేసు కునేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సింది పోయి, ఏకపక్షంగా దేశ రాజధానికి వెళ్లి ధర్నా పేరిట నాటకమాడారు" అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకి ముందు రిజర్వేషన్లు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి 42 శాతం

మిగితా 4వ పేజీలో



# చలో బస్ భవన్‌లో ఉద్రిక్తత

- పలువురు బీఆర్ఎస్ నాయకులు అరెస్ట్
- పెంచిన బస్ ఛార్జీలను తగ్గించాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన బస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల చార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, ముఠా గోపాల్, సికింద్రాబాద్ రెతిఫైల్ బస్‌స్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు భవన్‌కు రాగా.. మాజీ మంత్రి హరీశ్‌రావు, మెహిదీపట్నం నుంచి ఆర్టీసీ బస్సులో బస్సు భవన్‌కు బయలుదేరి వచ్చారు. ఈ క్రమంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్దనే పోలీసులు నిలువరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ వారు బస్సు భవన్‌కు నడుచుకుంటూ వెళ్లి ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తున్నదన్నారు. కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను నిరసిస్తూ ఛలో బస్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చామని తెలిపారు. మహిళలకు ఉచితమని చెప్పి పురుషులకు టికెట్ ధరలు పెంచారని విమర్శించారు. అదేవిధంగా విద్యార్థుల బస్సు పాస్ ధరలు పెంచారని మండిపడ్డారు. ఇలా ధరలు పెంచితే సామాన్య కుటుంబం మీద భారం పడదా అని ప్రశ్నించారు. మధ్యతరగతి కుటుంబాలకు ధరలు పెంచి పీక్కుతింటున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన బస్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు

మిగితా 4వ పేజీలో

## ఏసీబీ వలలో చిట్యాల తహసీల్దార్

- రూ.2 లక్షల నగదు తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

బలగం టీవీ, నల్లగొండ



నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ గుగులోతు కృష్ణ గురువారం రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ నల్లగొండ రేంజ్ ఆఫీసర్ సీహెచ్.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 172లో మ్యుటేషన్ చేయడానికి, సర్వే నెంబర్ 167 ఇన్‌స్పెక్షన్ చేయడానికి తహసీల్దార్ గుగులోతు కృష్ణ రూ.10 లక్షలు డిమాండ్ చేయగా రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రూ.2లక్షలు కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా తీసుకుంటుండ గా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గతం లోనూ ఈయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ నివా సంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనంలో జెర్రి..!

**బలగం టీవీ, మహబూబ్‌నగర్**



తెలంగాణలో విద్యా వ్యవస్థ తీరు మారడం లేదనడానికి మరో ఉదాహరణ ఈ ఘటన. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాడేపల్లిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మధ్యాహ్న భోజనంలో దారుణం చోటుచేసుకుంది. విద్యార్థులకు వడ్డించిన అన్నంలో జెర్రి (శతపాది) కనిపించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఒక్కరోజే కాకుండా ప్రతిరోజూ భోజనంలో పురుగులు, కీటకాలు వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని పదేపదే పాఠశాల యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. నాణ్యతలేని, అశుభ్రమైన ఆహారాన్ని తినాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

- **కలెక్టర్ ఎం. హరిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. బోయిన పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని విభాగాలు, వార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలు, రిజిస్టర్, ఫార్మసీ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ కలెక్టర్ ఎం. హరిత మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.



## బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు పితృవియోగం

- **కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య (75) గురువారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. వారి మరణ వార్త తెలిసి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. పితృవియోగంతో శోకసంద్రంలో మునిగిపోయిన ఎర్రోళ్ల శ్రీనివాస్ కుటుంబానికి తన సానుభూతిని తెలియజేస్తూ, "విజ్జయ్య గారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని కేసీఆర్ తెలిపారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ కూడా విజ్జయ్య మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. "వారి సేవలు చిరస్మరణీయాలు. ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను," అని కేటీఆర్ అన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజ్జయ మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర సంతాపం ప్రకటించారు. విజ్జయ మరణం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు మరియు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు హరీష్ రావు తెలిపారు. సిద్ధిపేట జిల్లా, చిన్న కోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో విజ్జయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రోళ్ల శ్రీనివాస్ ను మరియు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యాన్ని కల్పించారు.

విజ్జయ మృతి పట్ల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులకు ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కష్ట సమయంలో శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాల్సిందిగా ఎంపీ వద్దిరాజు భగవంతున్ని ప్రార్థించారు.

## ఎమ్మెల్యేలు సబితా, సుధీర్‌రెడ్డిలను అడ్డుకున్న పోలీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన 'ఛలో బస్ భవన్' కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ నిరసనలో పాల్గొనేందుకు అంబర్‌పేట నుంచి ఆర్టీసీ బస్సులో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే డి. సుధీర్‌రెడ్డి బస్ భవన్ వైపు బయలుదేరారు. అయితే, వారి ప్రయాణాన్ని మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. అంబర్‌పేట సమీపంలో బస్సును నిలిపివేసిన పోలీసులు, బస్సులో ఉన్న సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డిలను బలవంతంగా కిందకు దించారు. అనంతరం వారిని పోలీసు వాహనాల్లోకి ఎక్కించి, కొంత దూరం తీసుకెళ్లారు. లాలా గూడ ప్రాంతంలో వారిని వదిలిపెట్టారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించిన నేతలు, నిరసనను విరమించుకోలేదు. లాలా గూడ వద్ద వదిలిపెట్టిన వెంటనే, వారు అక్కడి నుంచి మళ్లీ మరొక బస్సు ఎక్కి బస్ భవన్ వైపు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వరంగల్ సీపీ ఎదుట మావోయిస్టు లొంగుబాటు..

**బలగం టీవీ, వరంగల్**



నిషేదిత సి.పి.ఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్, డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కి చెందిన మంద రూబెన్ ఏకన్నన్న ఏమంగన్న ఏసురేష్(67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు.

ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడిస్తూ హన్మకొండ జిల్లా, హసన్ పర్తి మండలం, వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్,ఏకన్నన్న ఏమంగన్న ఏసురేష్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్.ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీమాజీ ప్రధాన కార్యదర్శి ఒక్కప్పటి ఆర్.ఈ.సి పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపు నందుకొని మావోయిస్టు పార్టీ లో చేరి అజ్ఞతంలోని వెళ్ళిపోయాడు. 1981 సంవత్సరం నుండి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వం దళ సభ్యుడుగా కుంట, బస్టర్ ప్రాంతాల్లో పనిచేసాడు.

1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా అప్పగించడం జరిగింది. 1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగుడెం కు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు తరలించగా ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుండి తప్పించుకున్నాడు. 1992 లో జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీ లో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ ఏరామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమే తో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ, కోళ్లు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిస్తూ మావోయిస్టుల కోసం పని చేసేవాడు.

అనారోగ్యం బాధపడుతున్న రూబెన్, ఉద్యమంలో పాల్గోడంలో శరీరం సహకరించకపొవడం ముఖ్యంగా మావోయిస్టు సిద్దాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోవడం జరిగిందని సీపీ తెలియజేశారు.

**రూబెన్ పాల్పడిన నేరాల వివరాలు**

– కుంట దళ సభ్యుడిగా పనిచేసే సమయంలో పెద్ద కెడు వాల్, పండోడు, పిడిమాల్, బండారిపాడు గ్రామాలకు చెందిన గ్రామస్తులను దళ సభ్యులతో కలసి హత్యలు చేయడంతో పాటు ఎలమకొందా గ్రామ సర్పంచ్ ను హత్య చేసిన సంఘటనల్లో నిందితుడు.

–1988లో గొల్లపల్లి–మారాయి గూడ మార్గం లో పోలీసుల కాన్వాయి పై మావోయిస్టుల కలసి 20 మంది సి.ఆర్.పై.ఎఫ్ పోలీసులను దారుణంగా హత్య చేసి వారి ఆయుధాలను పట్టుకొని పోయిన సంఘటనలో నిందితుడు.

–1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడు గోపన్నతో కలసి తుర్లపాడు పోలీస్ స్టేషన్ పై దాడి చేసిన ఘటన లో రూబెన్ నిందితుడు.

రూబెన్ పై 8 లక్షల రూపాయల రివార్డ్ వుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

## గూప్ -1 నియామకాలు రద్దు చేయాల్సిందే

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత**
- **గ్రూప్-1 అవకతవకలపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం..**

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో గ్రూప్–1 నియామకాల అవకతవకల పై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక కూడా మన యువ కులు ఇంత బాధపడాల్సి వస్తుందని అనుకోలేదు, మన పిల్లల్ని బాధపెట్టే విధంగా ఈ ప్రభుత్వాలు ఉండకూడదు. ఏదైనా పొరపాటు జరిగితే సరిచేసుకోవాలి, తెలంగాణ వచ్చాక మొదటి 10 ఏళ్లలో కేసీఆర్ గారు విద్యార్థుల కోసం చేయాల్సినంత చేశారని అన్నారు. ఐతే దురదృష్టవశాత్తు మనం గ్రూప్–1 పరీక్ష నిర్వహించుకోలేకపోయాం, కానీ గత ప్రభుత్వం ఎప్పుడు విద్యార్థుల మీద కోపం పెట్టుకోలేదని, ఈ ప్రభుత్వం మాత్రం విచిత్రంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల మీద కూడా కేసులు పెడు తోందని, గ్రూప్–1 ఇష్యూను నేను ఒక తల్లి కోణంలో చూస్తున్నాను. ఒక కుటుంబంలో ఉద్యోగం వచ్చిందంటే ఆ కుటుంబం బాగుపడుతుందని, తెలంగాణ వచ్చాక తెలంగాణ తల్లులకు స్వాంతన ఉంటుందని భావించాం, కానీ ఇప్పటికీ మళ్లీ కొట్లాడాల్సి వస్తోందని అయితే కొట్లాడాల్సిన పరిస్థితి వస్తే తప్పకుండా కొట్లాడాల్సిందేనని అన్నారు.

ఈ ముఖ్యమంత్రి మాటకారి.. ఆయన చేయాల్సి పని చేయకుండా ప్రతిపక్షాలను తిడుతున్నారని, సీఎం, డిప్యూటీ సీఎం లు విద్యార్థుల సమస్యలపై మాట్లాడకుండా వారిని అవమానిస్తున్నారని, తెలంగాణ బిడ్డలమైనా మనం ఆకలైనా భరిస్తాం, కానీ అవమానాన్ని భరించమని అన్నారు. గత 6 నెలలుగా ఈ ప్రభుత్వ వైఖరిని చూస్తున్నామని, ఇక లాభం లేదని పోరాటానికి సిద్ధమయ్యామని గ్రూప్–1 కు సంబంధించి వారం రోజుల పాటు పోరాటాలు చేస్తామని అన్నారు. శుక్రవారం అశోక్ నగర్ లో వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం అటెన్షన్ ను ఆట్రాక్ట్ చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

తెలంగాణ జాగృతి చాలా సందర్భాల్లో ప్రజలకు అండగా నిలిచిందని, ఇప్పుడు మీరు చేసే పోరాటంలో కచ్చితంగా న్యాయపోరాటానికి మేము అండగా ఉంటామని జాగృతి అయిన సరే, కవిత అయిన సరే ప్రజలకు కష్టం వచ్చిందంటే ఊరుకునే రకం కాదని, తెలంగాణ ఉద్యమంలో పేగులు తెగేదాకా, అలసి పోయే వరకు పోరాటం చేశామని అన్నారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పని చేస్తూనే ఉంటామని, సిటీ లైబ్రరీ, అశోక్ నగర్ లో రాహుల్ గాంధీ అబద్ధపు అంశాలను ఎలా ముందుకు తెచ్చారో అదే ప్రాంతానికి వెళ్లి మనం నిరసన తెలుపాలని అన్నారు. గత రెండేళ్లలో ఉద్యోగాలు, బీసీలకు న్యాయం చేయాలని వందసార్లు అడిగాం, బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్ లో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ ప్రశ్నించరు? అసలు ఢిల్లీ పంచాయితీకి ఇక్కడి కాంగ్రెస్ నేతలు గల్లీ మాటలు మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక%ౌ%కాంగ్రెస్ పెద్దలు తెలంగాణ ప్రజలను పూర్తిగా వదిలేశారని, జీవో 29 కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేశారని, జీవో 29 రద్దు అయ్యే వరకు కంప్లీట్ గా పోరాటం చేస్తామని తెలిపారు.హైదరాబాద్ లో మాత్రమే కాదు%ౌ% జిల్లాలు, ఊర్లు, గ్రామాలకు వెళ్లి పోరాటం చేస్తామని, మన వాళ్లకు అన్యాయం జరుగుతుందని అర్థమయ్యిందంటే నేపాల్ లో జరిగిన ఉద్యమం కూడా పనిచేయదని, తెలంగాణ ఉద్యమ చరిత్రను ఇప్పటికీ రష్యా యూనివర్సిటీలో పాఠాలుగా చెప్తున్నారు, తెలంగాణ వచ్చాక మన విద్యార్థులు కడుపులో చల్ల కదలకుండా సచివాలయంలో ఉద్యోగాలు చేస్తారని ఆశపడ్డా. కానీ వాళ్లంతా రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తుంటే కడుపు రగిలిపోతోందని అన్నారు. మా తరం నష్టపోయిన సరే ఫ్యూచర్ జనరేషన్ బాగుండాలని అనుకున్నామని, కానీ వారికి కూడా అన్యాయం జరుగుతోందని, గత వందేళ్లుగా తెలంగాణ చరిత్ర పోరాటాలు, రక్తంతో తడిచిందని, ఇంకా ఎప్పుడు బాగుపడేది అని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టండి. ఉద్యోగాలు సాధించేలా కష్టపడండి, మీ తరపున మేము పోరాటం చేస్తామని, ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని తెలిపారు.

గ్రూప్ –1 నియామకాలు రద్దు చేసి తిరిగి ప్రిలిమ్స్, మెయిన్స్ నిర్వహించాలి. గ్రూప్–1 రిజల్ట్ చివరికంటా పోరాటం చేయాలని నిర్ణయించాం. ఎన్నికల్లో ఇచ్చిన జాబ్ క్యాలెండర్ హామీ అమలయ్యే వరకు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని తీర్మానించాం. 2 లక్షల ఉద్యోగాల పూర్తి స్తాయిలో ఇచ్చే వరకు ప్రభుత్వం పై పోరాటం చేస్తాం. టీజీపీఎస్సీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నాం. రిజర్వేషన్లను రద్దు చేసే విధంగా ఉన్న జీవో 29 ను రద్దు చేయాలని మొత్తం ఐదు తీర్మానాలను చేశాం. ఈ ఐదు తీర్మానాలను గవర్నర్, సీఎంలకు పంపిస్తాం. విద్యార్థుల పోరాటానికి మెయిన్ స్ట్రీమ్ మీడియా మద్దతుగా నిలవటం లేదన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఇలాగే వెలికి ప్రయత్నాలు చేశారన్నారు. నిరుద్యోగుల వెర్షన్ ను మెయిన్ స్ట్రీమ్ మీడియా చూపించాలని కోరుతున్నామని, నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించే వరకు పోరాటం చేస్తామని హామీ ఇస్తున్నా అని తెలిపారు.

# సిరిసిల్ల బైపాస్‌పై రైతులు వడ్లు ఆరబెట్టేందుకు అనుమతించండి

- **కలెక్టర్‌కు మున్సిపాలిటీ విలీన కౌన్సిలర్ల వినతి..**
- **సిరిసిల్ల మున్సిపాలిటీ విలీన గ్రామాల కౌన్సిలర్ల వినతి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలకు చెందిన రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఈసారి కూడా రెండవ బైపాస్‌ను ఉపయోగించుకోవడానికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. బుధవారం రోజున విలీన గ్రామాలకు చెందిన కౌన్సిలర్లు కలిసి, జిల్లా కలెక్టర్ కి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

చిన్న బోనాల, పెద్ద బోనాల, పెద్దూర్, సర్దాపూర్ ముష్టి పెల్లి, చంద్రంపేట, రగుడు వంటి విలీన గ్రామాలకు చెందిన రైతులకు వడ్లు ఆరబెట్టుకోవడానికి సరైన స్థలం అందుబాటులో లేదు. దీంతో గత ఐదు సంవత్సరాలుగా వీరు సిరిసిల్ల రెండవ బైపాస్ రోడ్డును వడ్లు ఆరబెట్టు కోవడానికి వినియోగిం చుకుంటున్నారు. ఈసారి కూడా ధాన్యం ఆరబెట్టుకునేందుకు బైపాస్‌ను ఉపయోగించుకునేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కోరారు. బైపాస్‌కి ఇరువైపులా సెంట్రల్ లైటింగ్ అమర్చడం వల్ల రాత్రి సమయాల్లో కూడా రోడ్డు స్పష్టంగా కనిపించి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా రగుడు నుండి వెంకటాపూర్ వరకు ఇరువైపులా ఉన్న రోడ్డులో ఒకవైపు మాత్రమే వడ్లు ఆరబోయడానికి పర్మిషన్ ఇవ్వాల్సిందిగా వారు అభ్యర్థించారు. కౌన్సిలర్ల వినతిని ఆలకించిన జిల్లా కలెక్టర్, రైతులకు మేలు చేసే ఈ అంశంపై సానుకూలంగా స్పందించారు. దీనికి సంబంధించిన అనుమతిని త్వరలో జారీ చేసే అవకాశం ఉంది. ఈ వినతి పత్రం సమర్పణ కార్యక్రమంలో 10వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బొల్గం నాగరాజు గౌడ్, 1వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ పోచవేని సత్య ఎల్లయ్య, 24వ వార్డు కౌన్సిలర్ బుర్ర లక్ష్మి మల్లికార్జున్, 22వ వార్డు కౌన్సిలర్ కల్లూరి లతా మధు మరియు 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ లు పాల్గొన్నారు.

# మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



- **మహిళల మానసిక ఆరోగ్య సదస్సులో సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ పిలుపు..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో ఈరోజు సుందరయ్య నగర్ లోని మహిళలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ ఏర్పాటు చేసి మాట్లాడినారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ.. మహిళలు మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇటీవలి కాలంలో మహిళలు కుటుంబం, ఉద్యోగం, సామాజిక బాధ్యతలు, మరియు వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం సాధించడంలో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగా ఆందోళన, నిరాశ, నిద్రలేమి, కోపం, మరియు శారీరక అనారోగ్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాలనే కాకుండా, తమ వ్యక్తిగత మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా సంరక్షించు కోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒక సంతోషకరమైన తల్లి, భార్య, ఉద్యోగిని కావాలంటే, ముందు మనసు ప్రశాంతంగా ఉండాలని అన్నారు. మానసిక ఆరోగ్యం కోసం మహిళలు ప్రతిరోజూ స్వీయ సంరక్షణ, మంచి అలవాట్లు అవలంబించాలని తెలిపారు. సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా స్నేహితులతో సంభాషణ, అవసరమైతే సైకాలజిస్టు సహాయం పొందడం లాంటివి చేయాలని అన్నారు. ఆరోగ్యకరమైన మనస్సే నిజమైన ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, మహిళలు పాల్గొన్నారు.

# త్వరలోనే ఆలయ నిర్మాణానికి నిధి సమర్పణ ప్రారంభం

- **శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి కన్వీనర్ మోర శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




సిరిసిల్ల పద్మశాలి కులబంధు వులకు హిందూ బంధువులకు సిరిసిల్ల మార్కండేయ వీధిలో అత్యంత పురాతనమైన విశిష్టమైన శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయము పునర్నిర్మాణం కై, శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి ఒక కార్యచర ణను ప్రారంభించింది. దీనిలో భాగంగా ఈ రోజు ప్రెస్ క్లబ్లో శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండు నెలల నుండే పద్మశాలి కుల బంధువు లతో, హిందు బంధువులతో సమాజంలోని అందరిని కలుపుకుని పోయే విధంగా దేవాల యాల ఆధారంగా 22 సమావేశాలను శాంతి నగర్ 'నుండి భూపతినగర్' వరకు, చంద్రం పేట నుండి సాయినగర్ వరకు నిర్వహించి అభిప్రాయాలను సేకరించిందని అన్నారు.

దేవాలయ పునర్నిర్మాణం హిందూ సంఘటనా శక్తికి, ఆత్మ గౌరవానికి, సమరస తకు చిహ్నంగా శ్రీ లలితా పరమేశ్వరీ లక్ష్మీనారా యణ సహిత శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మా ణములో సామాన్యుడి నుండి సంపన్నుడి వరకు అందరినీ భాగస్వామ్యం చేయాలని భావించి అందుకు నిధి సమర్పణ కార్యాచరణను ప్రారంభించి తెలియజేపింది వారి అభిప్రాయాలను సేకరించిందని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ముఖ్యంగా తెలియజేయడం ఏమనగా అతి త్వరలోనే దేవాలయ నిధి సమర్పణ కార్యా చరణను ప్రారంభం. చేస్తున్నామని అది కూడా వారం పది రోజులలో ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నామని, ఇటీవల అయోధ్య లో భవ్యమైన దివ్యమైన అయోధ్య రామమందిర నిర్మాణముకై జరిపిన నిధి సమర్పణ కార్య విధానమే స్ఫూర్తిగా తీసుకుని సామాన్యుడి నుండి సంపన్నుడి వరకు అందరం దేవుడి ముందర సమానమే అనే భావనతో ప్రయత్నం చేసి సిరిసిల్ల లో దివ్యమైన భవ్యమైన, శ్రీ మార్కండేయ ఆలయాన్ని పునర్నిర్మాణం చేద్దామని ఇది మనందరి సంఘటితశక్తికి, స్వాభిమానా ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఉంటుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా తను మన ధనాన్ని భగవంతునికి దేవాలయానికి సమర్పించి భగవంతుని కృపకు పాత్రులు కాగలరని, శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి తెలిపిందని అన్నారు. త్వరలోనే నిధి సమర్పణ ప్రారంభం తేదీని మీకు మీడియా ద్వారా తెలియపరుస్తామని అన్నారు. దేవాలయానికి "ఇచ్చే ఒక ఇటుక కానీ, ఒక రూపాయి కానీ సమర్పణ చేస్తే తర తరాలకు పుణ్యం లభిస్తుంది . కావున ప్రతి ఒక్కరూ సమర్పణకి తను మన ధన ని సమర్పించి భాగస్వాములై భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెరుగు సత్యనారాయణ, మాదాస శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, కోడం రవి, గుంటుక పురుషోత్తం, చిమ్మని ప్రకాష్, గాజుల సదానందం, గుడ్ల విష్ణు, జిందం రవి, ఎనగంటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్లలో ఘనంగా శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్లలో హరిహర బ్యాంకెట్ హాల్లో సిరిసిల్ల శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా గురువారం నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస మిత్రుల వ్యవస్థాపకులు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి వచ్చి గత సంవత్సరం నుండి శ్రీనివాస మిత్రుల కార్యక్రమాలను సిరిసిల్ల శ్రీనివాసులకు వివరించడం జరిగింది. ముఖ్యంగా తల సేమియా రోగులకు రక్తదాన కార్యక్రమం విద్యార్థిని విద్యార్థులకు వితరణ చేసినటువంటి నోటు బుక్కులు పెన్నులు లాంటి సేవా కార్యక్రమాలు అదేవిధంగా ఆరోగ్య కి సంబంధించినటువంటి ఆహార కార్యక్ర మాల సూచనలు సలహాలు నేటి వరకు అనేకం నిర్వహించడం జరిగిందని చెప్పడం జరిగింది. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల అక్టోబర్ 26న ఆదివారం రోజున పివిఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా శ్రీనివాసుల మిత్రులచే ఆత్మీయ సమ్మేళనం కలదని, ఆ రోజు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమం కలదని ఇట్టి కార్యక్రమానికి ప్రతి ఒక్క శ్రీనివాసుడు సిరిసిల్ల నుండి పెద్ద ఎత్తున తరలి రావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల శ్రీనివాస మిత్రులు సోక్కి శ్రీనివాస్, కామారపు శ్రీనివాసు, మాదాసు శ్రీనివాస్, మోర శ్రీనివాసు, గాలి శ్రీనివాసు, నాగుల శ్రీనివాసు, భీమవరం శ్రీనివాసు, చొప్పదండి శ్రీనివాసు, బూర శ్రీనివాసు తదితర శ్రీనివాసులు పాల్గొన్నారు.



# కేటీఆర్, హరీశ్‌రావుల హౌస్ అరెస్టును ఖండిస్తూ కంచర్ల రవి గౌడ్ నిరసన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు మాజీ మంత్రి హరీష్ రావు ని హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో చేనేత చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. "ప్రజల పక్షాన నిలిచే నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీ బస్సు చార్జీలను 50 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేటీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ భవన్ వద్ద వినతిపత్రం ఇవ్వడానికి ముందే నాయకులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమని రవి గౌడ్ అన్నారు. "ప్రజల పక్షాన నిలిచిన వారిని చూసి భయపడటం కాంగ్రెస్ ప్రభుత్వ బలహీనతకు నిదర్శనం" అని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాకపోవడంపై కక్ష సాధింపులు మొదలుపెట్టిందని రవి గౌడ్ విమర్శించారు. ఆర్టీసీ కార్గోను ప్రైవేట్ పరం చేయడం, బస్సు చార్జీలు పెంచడం ప్రజలకు భారంగా మారిందని, "ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా ప్రజా పాలన?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని లాభాల దిశగా తీసుకువెళ్లడానికి ప్రారంభించిన కార్గో సేవలను ప్రైవేట్ చేతుల్లోకి ఇవ్వడం ప్రజా వ్యతిరేక చర్య అని ఖండించారు. "ఎన్ని అరెస్టులు చేసినా బీఆర్ఎస్ వెనుకడదని, కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగిస్తాం" అని రవి గౌడ్ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మట్టి శ్రీనివాస్, శివరాం, అడిచర్ల సాయి, గాజుల మహేష్, సంపత్, వెలమల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నాయకులు అరెస్ట్..

**బలగం టీవీ, హైదరాబాద్**

పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వినతిపత్రం సమర్పించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు, వారిని బలవంతంగా అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కిశోర్ గౌడ్, గుమ్మడి సతీష్, నాసిర్, అభినవ్, వెంకట్రాములు, రాజకుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రదీప్ రంగనాథన్ హీరోగా 'డ్యూడ్'

● అక్టోబర్ 17న విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

'లవ్ టుడే', 'డ్రాగన్' వంటి విజయవంతమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ యువ నటుడు ప్రదీప్ రంగనాథన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డ్యూడ్ (%ఐబుఎవ%). ఈ సినిమాకు కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మలయాళ సుందరి, ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకుల మన్నన పొందిన మమితా బైజు కథానాయికగా నటిస్తోంది.

డ్యూడ్ సినిమాను తమిళంతో పాటు తెలుగు భాషల్లోనూ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్ర ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో, యువతలో మంచి హైప్ క్రియేట్ చేస్తోంది. ట్రెండీ లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా మ్యూజిక్, విజువల్స్, ప్రదీప్%-%మమితా కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

## భారత్-అమెరికా సంబంధాలు పెంచేలా నిర్ణయాలుండాలి

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాలు మరియు తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడం ప్రపంచ ప్రమాణాలకు సవాలుగా ఉందని అన్నారు.జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని, 2034 నాటికి ?1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలని, 2047 నాటికి ?3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉందని తెలిపారు.హైదరాబాద్‌లో గేమ్-ఛేంజర్ ప్రాజెక్టులు, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి జరుగుతున్నాయని, డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి మచిలీపట్నం పోర్ట్ వరకు 12-లేన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్%-%చెన్నై, హైదరాబాద్%-%బెంగళూరు బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు ఉన్నాయని, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కొత్త మార్గాలను తెరవనున్నట్లు తెలిపారు.

30,000 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్లో ఉన్నాయని, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. 'చైనా ం1' వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా ఉందని, భవిష్యత్తు ప్రణాళికలను ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లో ఏఐ సిటీ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, రాష్ట్రాన్ని దేశానికి స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. పేరొందిన కంపెనీలు హైదరాబాద్లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ ఏర్పాటు చేశాయని, వీటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు, అలాగే హైదరాబాద్ కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సిన్‌ల సరఫరాలో ప్రధాన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. హడ్సన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు, వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్, రేషనల్‌వేవ్ క్యాపిటల్ పార్టనర్స్ మార్క్ రోసెన్‌బ్లాట్, క్రౌ హోల్డింగ్స్ చైర్మన్ హర్లాన్ క్రో, ఈగిల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు రావెనెల్ కరీ, బిల్లింగ్స్లీ కంపెనీ భాగస్వామి హెన్రీ బిల్లింగ్స్ సహా మొత్తం 16 మంది అమెరికా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

## భారత్ వృద్ధి గాథలో భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడమే కాకుండా, ఉద్యోగ అవకాశాలను కూడా సృష్టిస్తుందని మోదీ తెలిపారు. "2030 లక్ష్యానికి ముందే ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడం సాధ్యమవుతుంది," అని ఆయన పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌తో కలిసి జరిగిన ఫోరమ్‌లో మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక అస్థిరతల మధ్య భారత్-యూకే వాణిజ్య భాగస్వామ్యం స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తుందని మోదీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, రెండు దేశాల పరిశ్రమలు ఎదుర్కొంటున్న అడ్డంకులను తొలగించి, వాణిజ్య అవకాశాలను విస్తరించడానికి కలిసి పనిచేయాలని సూచించారు. "ఈ వాణిజ్య ఒప్పందం కింద పెట్టుబడులు, ఉద్యోగాలు, సాంకేతికతలో విస్తృత అవకాశాలు ఉన్నాయి," అని స్టార్మర్ తెలిపారు. మూడు నెలల్లో 6 బిలియన్ పౌండ్ల మేర వాణిజ్యం పెరిగిందని ఆయన వివరించారు. యూకే-ఇండియా టెక్నాలజీ సెక్యూరిటీ ఇనిషియేటివ్ ప్రారంభించబోతున్నామని వెల్లడించారు.

## హ్యామ్ విధానంతో రోడ్లకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)



చేయనున్నామని తెలిపారు. దేశానికే రోల్ మోడల్ గా నిలపాలనే లక్ష్యంతో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని అన్నారు. రోడ్డు ప్రమాదాలు లేకుండా నిర్మాణంపై ప్రధాన దష్టి సారించామని చెప్పారు. దశలవారీగా హ్యామ్ రోడ్లు చేపట్టనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. మొదటిదశలో సింహ భాగం హ్యామ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. అందులో సింగిల్ , డబుల్ వరుసలు, నాలుగు వరుసల వారిగా రోడ్ల బలోపేతం చేయనున్నామన్నారు. దీంతో పాటు రోడ్ల వెడెల్పు చేయనున్నట్టు తెలిపారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసలు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వం ధఢ సంకల్పంతో ముందుకెళుతుందని స్పష్టం చేశారు. ఇందులో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమ ప్రాధాన్యతని స్తున్నామన్న మంత్రి, ఒక అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఇంకో అసెంబ్లీ నియోజకవర్గానికి కనెక్టివిటీ కారిడార్లుగా హ్యామ్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మొదటి ఫేజ్‌కు ఒకటి, రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నట్టు మంత్రి వెల్లడించారు.

# భారత్ తొలి ఓటమి

## ఉత్కంఠభరిత పోరులో భారత్‌పై సఫారీ జట్టు విజయం




**బలగం టీవీ, హైదరాబాద్**

వన్డే ప్రపంచకప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత మహిళా జట్టుకు దక్షిణాఫ్రికా జట్టు షాక్ ఇచ్చింది. వైజాగ్‌లో గురువారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో సఫారీలు చివరి ఓవర్లో మూడు వికెట్ల తేడాతో గెలుపొందారు. స్పిన్నర్ల స్ఫూర్తిదాయక బౌలింగ్‌తో భారత్ విజయానికి చేరువైనప్పటికీ, చివర్లో డీక్లెర్క్ (84 నాటౌట్) ఆరంభించిన సుడిగాలి ఇన్నింగ్స్ సఫారీలకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. అమన్‌జోత్ కౌర్ వేసిన 49వ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన డీక్లెర్క్ మ్యాచ్‌ను సౌతాఫ్రికా వైపు తిప్పింది.

ఛేదనలో ఆరంభం నుంచే సఫారీలు ఒత్తిడిలో పడ్డారు. తొలి ఓవర్లో కేవలం ఒక రన్ మాత్రమే ఇచ్చిన పేసర్ క్రాంతి గౌడ్ రెండో ఓవర్లోనే తంజిమ్ బ్రిట్స్ (0) వికెట్‌ను కూల్చింది. వెంటనే సునే లుస్ (5)ను అమన్‌జోత్ ఔట్ చేయడంతో సఫారీల పరిస్థితి కష్టమైంది. ఈ సమయంలో కెప్టెన్ లారా వొల్వార్డ్ట్ (70) ధైర్యంగా ఆడుతూ స్కోర్‌బోర్డును ముందుకు నడిపింది. ఆమెను స్నేహ్ రానా క్లీన్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ మళ్లీ భారత్ వైపు మళ్లింది. దీప్తి శర్మ, శ్రీచరణి, క్రాంతి బౌలర్లుగా విజృంభించారు. కానీ చివర్లో చోలే ట్రయాన్ (49) మరియు డీక్లెర్క్ జోడీ సఫారీలకు ఆత్మస్థైర్యం ఇచ్చింది. రానా వేసిన 46వ ఓవర్లో డీక్లెర్క్ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి దూకుడు కొనసాగించగా, ట్రయాన్ ఔట్ అయినప్పటికీ డీక్లెర్క్ ధాటికి భారత్ చేతులెత్తేసింది. చివరి రెండు ఓవర్లలో వరుసగా బౌండరీలు బాదుతూ సఫారీలను విజయతీరాలకు చేర్చింది డీక్లెర్క్.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టులో రీచా ఘోష్ (94) మరోసారి చెలరేగి అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. టాప్ ఆర్డర్ త్వరగా పెవిలియన్ చేరినా, రీచా ఒంటిచేత్తో జట్టును నిలబెట్టింది. అమన్‌జోత్ కౌర్ (51)తో ఏడో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం కుదుర్చి, చివర్లో రానా సహకారంతో ఎనిమిదో వికెట్‌కు 88 పరుగులు జోడించింది. డెత్ ఓవర్లలో రీచా దూకుడుగా ఆడి, 251 పరుగుల గౌరవప్రద స్కోర్‌ను అందించింది. భారత స్పిన్నర్లు రానా, దీప్తి, శ్రీచరణి, క్రాంతి అద్భుత బౌలింగ్‌తో సఫారీలను అణచివేయగా, చివరి దశలో డీక్లెర్క్ జోరు ఆ జట్టును అజేయ భారత్‌పై చారిత్రక విజయానికి నడిపింది.

## ఎర్రచీరకు ఏ సర్టిఫికెట్




**బలగం టీవీ, హైదరాబాద్**

బేబి డమరి సమర్పణలో, శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్ - శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం ఎర్రచీర విడుదలకు సిద్ధమైంది. ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించింది. ఈ సినిమాకు సుమన్ బాబు దర్శకత్వం వహించడమే కాకుండా ఒక కీలక పాత్రలో కూడా నటించారు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలను మేళవించి ఈ సినిమాను రూపొందించారు.

హారర్ సన్నివేశాలు అధికంగా ఉండటంతో సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు సుమన్ బాబు మాట్లాడుతూ, "సినిమాలో ఉన్న హారర్ ఎలిమెంట్స్ చాలా రియలిస్టిక్‌గా, ఇంటెన్స్‌గా ఉంటాయి. కాబట్టి గుండె జబ్బులు ఉన్న ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని సూచించారు. చిత్ర నిర్మాతల్లో ఒకరైన ఎన్.వి.వి. సుబ్బారెడ్డి (సుభాష్) మాట్లాడుతూ, "సినిమా కంటెంట్‌లో డివోషనల్ టచ్ ఉంది. అందుకే కార్తీక మాసం సందర్భంగా, అక్టోబర్ 24న సినిమాను విడుదల చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయి" అని తెలిపారు.

## చలో బస్ భవన్‌లో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ నిరుపేదల నడ్డి విరుస్తూ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని నిరసన తెలుపుతుంటే తమ నేతలను అన్యాయంగా అరెస్టు చేశారని ఇది దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. అప్రజాస్వామికం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వానికి ఇదొక నిదర్శనన్నారు అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 20 నెలల పాలనలో అయిదు సార్లు బస్సు చార్జీలు పెంచారనీ, భార్యకు ఫ్రీ అని భర్తకు, విద్యార్థులకు టికెట్ రేటు డబుల్ చేశారని విమర్శించారు. ఇప్పటికే జీవో నెంబర్ 53, 54లతో కొత్త వాహనాలపై లైఫ్ టాక్స్ పెంచి ప్రజలపై భారం వేశారన్నారు. ఇలా వాహనాల లైఫ్ టాక్స్‌లు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతూ ప్రజల రక్తాన్ని పీల్చుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి తలమానికంగా ఉన్న మెట్రో రైలును రేవంత్ సర్కారు ఆగం చేసిందన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాసిందని ఇది ఇందిరమ్మ రాజ్యమా ఎమర్జెన్సీ పాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం

(మొదటి పేజీ తరువాయి)

బీసీలకు పదవులు కట్టబెడతామని చెప్పి, పూటకొక మాటను కాంగ్రెస్ మార్చిందన్నారు. చివరికి రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేసుకున్నాక రిజర్వేషన్లు సాధిస్తామని చెప్పిన అడ్డగోలు మాటల్ని కూడా కేటీఆర్ గుర్తు చేశారు.ఒకవైపు రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్ లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చేశారని, చివరికి న్యాయస్థానాల్లో నిలబడని జీఓతో మభ్యపెట్టారని ఆయన అన్నారు. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి, పార్టీ పరంగా ఇస్తామని ప్రతిపాదనలు తెరపైకి తెచ్చిన నాడే కాంగ్రెస్ మోసం బయటపడి పోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.22 నెలల చేతకాని పాలనపై ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా పెల్లుబుకుతున్న ప్రజాగ్రహం, వ్యతిరేక తను చూసి ముఖ్యమంత్రి భయంతో వణికిపోతున్నారని కేటీఆర్ అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాని ప్రభుత్వం మరోవైపు తన అసమర్థ పరిపాలన విధానాలతో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాలను కార్యక్రమాలను ఆపేసి తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని, అందుకే స్థానిక ఎన్నికలను వివాదంగా మార్చి, ఏదో రకంగా వాయిదా వేయించేందుకు బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పావుగా వాడుకున్నారు అని ఆయన దుయ్యబట్టారు.

"రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేసిన దగాకు తోడు, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా బీసీ బిల్లులను పెండింగ్ లో పెట్టి వెనుకబడిన వర్గాలను దారుణంగా వెన్నుపోటు పొడిచింది" అని కేటీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మోసాలను, ముఖ్యమంత్రి చేసిన దుర్మార్గాన్ని చూసి రాష్ట్రంలోని బలహీనవర్గాల ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఇప్పటికే పల్లెల్లో పాలన పడకేసి ప్రజలు అవస్థలు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.